గిరిజన బాలికల గురుకుల పాఠశాలను సందర్శించిన జడ్జి

పీలేరు: పీలేరులోని ఎపి గిరిజన బాలికల గురుకుల పాఠశాలను ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సాకే జ్యోతి ఆకస్మికంగా సందర్శించారు. శనివారం న్యాయమూర్తి గురుకుల పాఠశాలలోని బాలికలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాను తెలుసుకున్న విషయాలను సంబంధిత శాఖ ఉన్నతాధికారులకు తెలియజేస్తానని చెప్పారు. హాస్టల్ పిల్లలు న్యాయమూర్తితో మాట్లాడుతూ తమకు వసతి, నీరు, మరుగుదొడ్లు, స్నానపు గదులతో పాటు ఇతర సమస్యలు చాలా ఉన్నాయని, వర్షం వస్తే భవనం ఉరుస్తుందని కూడా తెలియజేశారు. ఈ విషయాలు అనేకసార్లు పెద్దల దృష్టికి తీసుకు పోయినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎపి గిరిజన బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ అన్నపూర్ణ, హాస్టల్ వార్డెన్ లక్ష్మీదేవి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సిబ్బందితో మాట్లాడుతున్న జడ్జి జ్యోతి

'భూముల గుర్తింపు నివేదికలు పక్కాగా ఉండాలి'

ప్రజాశక్తి-రాయచోటి

అసైన్‌మెంట్ భూములు గుర్తింపు నివేదికలు పక్కాగా ఉండాలని సిఎం కార్యాలయ కార్యదర్శి ముత్యాలరాజు పేర్కొన్నారు. శనివారం సాయంత్రం విజయవాడ నుంచి ఆయన జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు స్థానిక రాయచోటి కలెక్టర్ కార్యాలయంలోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ గిరీష పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముత్యాలరాజు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో అవసరమైనచోట్ల ఎస్‌సి శ్మశాన వాటికలకు భూమి గుర్తింపు ప్రక్రియ, అసైన్మెంట్ వ్యవసాయ భూముల వివరాలు, చుక్కల భూములు వివరాలు, లంక ల్యాండ్స్ గుర్తింపు తదితర అంశాలపై కలెక్టర్లతో సమీక్షించారు. అసైన్మెంట్ భూముల గుర్తింపులో నివేదికలను పక్కగా రూపొందించాలని ఆ తర్వాత పబ్లికేషన్ జారీ చేయాలన్నారు. భూముల గుర్తింపు ప్రక్రియ, తుది జాబితా రూపకల్పనలో తేడా రాకుండా పక్కగా నివేదికలను రూపొందించాలన్నారు. అన్నిచోట్ల నిబంధనల ప్రకారం అసైన్మెంట్ కమిటీ సమావేశాలను నిర్వహించాలని సూచించారు. లంకా ల్యాండ్స్ భూముల గుర్తింపుకు సంబంధించి ముగ్గురు సభ్యుల కమిటీ ఆమోదం తీసుకోవాలన్నారు. ఎస్సీ శ్మశాన వాటిక లకు సంబంధించి ఆయా మండలాల్లో అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించాలని, చుక్కల భూముల నివేదికలను కూడా నిబంధన మేరకు రూపొందించాలని సూచించారు. ఆయా అంశాలకు సంబంధించి జిల్లాలోని లక్ష్యాలను త్వరితగతిన పూర్తిచేయాలని ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శి కలెక్టర్లను ఆదేశించారు.

మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

డిడి అచ్చన్న మృతిపై సమగ్ర విచారణ : డిఎస్‌పి

మాట్లాడుతున్న రాయచోటి డిఎస్‌పి శ్రీధర్

ప్రజాశక్తి-రామాపురం

కడప జిల్లా పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ చిన్న అచ్చన్న మృతిపై సమగ్ర విచారణ చేపడతామని రాయచోటి డిఎస్‌పి శ్రీధర్ అన్నారు. శనివారం సాయంత్రం స్థానిక రామాపురం పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు అదృశ్యమై శవమైన కనిపించిన అచ్చనపై క్షేత్రస్థాయిలో విచారణ చేపడతామన్నారు. కర్నూలు-చిత్తూరు 40వ జాతీయ రహదారిలోని రామాపురం మండలం గువ్వల చెరువు ఘాట్ రోడ్డులోని కోనేటి బండల సమీపంలో శుక్రవారంచిన్న అచ్చన్న శవమై కనిపించినట్లు ఆ గ్రామం విఆర్‌ఒ కల్లూరు ఫాతిమాబి ఫిర్యాదు చేశారని తెలిపారు. తమ సిబ్బంది అక్కడికి వెళ్లారని ఆయన మృతికి సంబంధించిన ఆనవాళ్లు, మృతుని వద్ద ఉన్న ఆనవాళ్ల మేరకు కుటుంబీకులకు సమాచారం అందించమని పేర్కొన్నారు. లక్కిరెడ్డిపల్లె సిఐ వరప్రసాద్, రామాపురం ఎస్‌ఐ కొండారెడ్డి. సంఘటన స్థలాన్ని చేరుకొని మృతిని శవ పంచనామ కోసం డాక్టర్‌ను సంఘటన స్థలానికి పిలిపించి శవ పంచనామా జరిపించమన్నారు. అచ్చన్న మృతదేహాన్ని ఆయన కుటుంబీకులకు శుక్రవారం రాత్రి పొద్దుపోయాక అందజేశామన్నారు. పశు సమర్ధక శాఖలో డిప్యూటీ డైరెక్టర్ చిన్న అచ్చన్న విధులు నిర్వహిస్తున్న సమయంలో సస్పెన్షన్‌కు గురైనట్లు తమకు సమాచారం ఉందన్నారు. ఆ నోటీసులు తీసుకున్నందుకు మనస్థాపానికి గురయ్యారని సమాచారం ఉందన్నారు. కుటుంబీకులు, ఆ శాఖ అధికారులను సమగ్రంగా విచారిస్తే తనంతకు తానే చనిపోయాడా ఇతర కారణాలు ఉన్నాయా అనే విషయంపై సమగ్రంగా విచారణ చేస్తామన్నారు.

మహిళలకు వరం వైఎస్‌ఆర్ ఆసరా : జెసి

ప్రజాశక్తి-రాయచోటి

వైఎస్‌ఆర్ ఆసరా పథకం మహిళలకు వరం లాంటిదని జెసి తమీమ్ అన్సారీయా అన్నారు. ఆసరా పథకం కింద 3వ విడత జిల్లాలోని డిఆర్‌డిఎ, మెప్మా పరిధిలోని 24,915 డ్వాక్రా సంఘాలకు రూ.223.56 కోట్లు జమ చేశామన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్లో మహిళా సంఘాలకు వైయస్సార్ ఆసరా పథకం 3వ విడత రుణమాఫీ-స్వయం సహాయక సంఘాల ఖాతాల్లో జమ చేసే కార్యక్రమాన్ని ఎల్ఇడి స్క్రీన్ ద్వారా ప్రత్యక్ష ప్రసార కార్యక్రమంలో జెసి అన్సారీయా, ఉమ్మడి జిల్లా జడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి పాల్గొన్నారు. డ్వాక్రా సంఘాల లబ్ధిదారులకు రూ.223.56 కోట్ల చెక్కును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారీయా మాట్లాడుతూ వైఎస్‌ఆర్ ఆసరా పథకం 3వ విడతకు సంబంధించి అన్నమయ్య జిల్లాలో డీఆర్డీఏ మరియు పట్టణ ప్రాంతాల్లోని మెప్మాలో జిల్లా మొత్తం 24,915 సంఘాలకు చెందిన 2,33,293 మంది మహిళలకు ఖాతాల్లో రూ.223.56 కోట్లు జమ చేశామన్నారు. వైఎస్‌ఆర్ ఆసరా పథకం 3వ విడతకు సంబంధించి డిఆర్‌డిఎ నుంచి 22,214 స్వయం సంఘాల్లోని 2,08,174 మంది సభ్యులకు రూ.198.515 కోట్లు, పట్టణ ప్రాంతాల్లోని మెప్మా పరిధిలో ఉన్న 2701 సంఘాల్లోని 25,119 మంది మహిళలకు రూ.24.49 కోట్లు జమ చేశామన్నారు. ప్రభుత్వం ఇస్తున్న ఆర్థిక సహాయాన్ని మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైయస్సార్ ఆసరా పథకం వల్ల మహిళా సాధికారత మరింత మెరుగుపడి, గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాలలోని స్వయం సహాయక సంఘాలలోని పేద మహిళల ఆర్థిక పురోగతికి దోహదపడుతుందన్నారు. మహిళాభివృద్ధి ద్వారానే కుటుంబాభివృద్ధి జరుగుతుందనే ఉద్దేశంతో అమ్మ ఒడి పథకం, గోరుముద్ద, విద్యాదీవెన, వసతి దీవెన, విద్యాకానుక, పేదింటి ఆడపిల్లలకు అండగా ప్రభుత్వ బడుల రూపురేఖలను మార్చే మనబడి నాడు-నేడు, ఇళ్ళ పట్టాలు అక్కచెల్లెమ్మలకు ఇలా ఎన్నో కార్యక్రమాలు రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రవేశపెట్టారన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి మాట్లాడుతూ మహిళల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, మహిళల ఆర్థిక స్వావలంబన కోసం అనేక సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారన్నారు. ప్రతి మహిళ స్వయం సమృద్ధి సాధించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందడుగు వేస్తుందని, అతివలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. జగనన్న తన పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు 3వ విడత పొదుపు సంఘాల మహిళల ఖాతాలలో జమ చేయడం పై మహిళల జీవితాల్లో వెలుగులు నింపుతోందన్నారు. అమూల్ వంటి గొప్ప సంస్థతో ఒప్పందం కుదుర్చుకుని పాల ఉత్పత్తులను పెంపొందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఈ విధంగా హామీలు నెరవేర్చి, మహిళల ఆర్థికాభివృద్ధికి చర్యలు చేపట్టడం దేశ చరిత్రలోనే జగనన్న రికార్డ్ సాధించారన్నారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ సత్యనారాయణ, ఎల్‌డిఎం వెంకటేశ్వర్‌రెడ్డి, డిపిఎం లక్ష్మీప్రసాద్, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షులు మైతిలి, రాయచోటి ఇన్‌ఛార్జి ఎంపిడిఒ, డిఆర్‌డిఎ, మెప్మా సిబ్బంది, పొదుపు సంఘాల మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మహిళలకు చెక్‌ను అందజేస్తున్న జెసి, జడ్పీ చైర్మన్

'వడ్డెరులను ఎస్‌టి జాబితాలో చేర్చాలి'

సమావేశంలో మాట్లాడుతున్న వడ్డెర సంఘం నాయకులు

ప్రజాశక్తి-రాయచోటి

ఎస్‌టి రిజర్వేషన్ల ప్రామాణికాలకు వడ్డెరులు అర్హులైనప్పటికీ చేర్చకుండా ప్రభుత్వాలు కాలయాపన చేస్తున్నాయని వడ్డెర మేధావుల ఫోరం రాష్ట్ర కన్వీనర్ జీవానందం పేర్కొన్నారు. శనివారం ఎస్.ఎన్.కాలనీలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అప్పటి నీలం సంజీవరెడ్డి ఎపి ప్రభుత్వం దేశంలోని మిగతా రాష్ట్ర ప్రభుత్వాలకు భిన్నంగా 1972లో వడ్డెర సంచార విముక్త జాతి హక్కులను ఉల్లంఘించి ఎస్‌టిలో చేర్చకుండా బిసిలో చేర్చి తీరని ద్రోహం చేసిందన్నారు. అప్పటి నుండి 45 ఏళ్లుగా హక్కుగా దక్కాల్సిన ఎస్‌టి రిజర్వేషన్ కోసం కేంద్ర ప్రభుత్వం, సంచార జాతుల, తెగల జీవన స్థితిగతులు, వారి వెనుకబాటుతనంపై నివేదిక కొరకు నియమిస్తున్న ప్రతి కమిషన్, కమిటీ ముందు మాగోడు వినిపిస్తూనే ఉన్నామని, రాష్ట్రంలోని ఏ వర్గమూ అనుభవించని దుర్భర జీవితాలను వడ్డెరలు అనుభవిస్తున్నారనేది జగ మెరిగినసత్యమన్నారు. ఇప్పటికీ కేంద్ర ప్రభుత్వం జాబితాలో ఒడ్డెర్లు విముక్త సంచార జాతులుగానే ఉన్నారన్నారు. బోయలు వాల్మీకులను ఎస్టీలో చేర్చాలని ఆలోచన వచ్చిన ప్రభుత్వానికి వడ్డెర్లు గుర్తుకు రాకపోవడం విచారకరమని, గత ప్రభుత్వం వడ్డెర్ల జీవన స్థితిగతులు వివిధ సామాజిక స్థితిగతుల అధ్యయనానికై ఎస్‌టిలో చేర్చడానికై ఉద్దేశించి నియమించిన 'సత్య పాల్' కమిటీని ఈ ప్రభుత్వం కొనసాగించ కుండా విస్మరించడం దురదృష్ట కరమన్నారు. మాకు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కంటే కులం మొత్తం పేదరికం బారి నుండి బయట పడే ఎస్‌టిలో చేర్చాలన్నారు. ఎస్‌టి రిజర్వేషన్ మాహక్కు అది కల్పించిన పార్టీకే తమ మద్దతుంటుందని పేర్కొన్నారు. సమావేశంలో కాంట్రాక్టర్ శ్రీరాములు, ఫైనాన్సియర్ బాలకృష్ణ, కార్మిక సంఘ నాయకులు రవి, సుధాకర్, నర్సింహులు, కేశవ్ పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

రాహుల్‌పై అనర్హత వేటు బిజెపి కుట్రలో భాగమే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కాంగ్రెస్ అగ్రనేత నేత ఎంపీ రాహుల్ గాంధీపై అనర్హత వేటు ప్రజాస్వామ్య విరుద్ధమని మదనపల్లి కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు రెడ్డి సాహెబ్ విమర్శించారు. శనివారం పట్టణంలోని ఇందిరమ్మ విగ్రహానికి పూలమాల వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాహుల్ గాంధీ నిర్వహించిన జోడో యాత్రతో పార్టీకి నూతన జవసత్వాలు నింపడంతో కేంద్రంలో బిజెపికి ప్రత్యామ్నాయం లేకుండా చేయడం కోసమే రాహుల్ గాంధీకి విధించిన రెండేళ్ల జైలుశిక్ష, ఆ వెంటనే అనర్హత వేటని పేర్కొన్నారు. బిజెపి అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎదుర్కొనడంతోపాటు, ప్రజాస్వామ్యాన్ని బ్రతికించు కోవడానికి బిజెపి యేతర పార్టీలన్నీ ఏకమవ్వాలని పిలుపునిచ్చారు. రాహుల్ గాంధీపై రాజకీయ దురుద్దేశంతోనే కేసు బనాయించి,ప్రశ్నించే గొంతుకను నొక్కడం జరిగిందన్నారు. ఇలాంటి నిర్ణయాలు ప్రజా ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని పేర్కొన్నారు. రాజకీయంగా ఎదుర్కొనలేక చట్టాలను అడ్డం పెట్టుకొని బిజెపి ఎంతో చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు, ఎంపీపై తీసుకొన్న నిర్ణయాన్ని ప్రజాక్షేత్రంలోనే తేల్చు కుంటామన్నారు. కార్యక్రమంలో రామసముద్రం మండలం ఇన్‌ఛార్జి ఖాదర్ బాషా, మహబూబ్ పీర్, ఖాజా పీర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

మెరిట్ స్కాలర్‌షిప్‌కు 15 మంది విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి-రాయచోటి

మండలంలోని ఆదర్శ పాఠశాల చెందిన నేషనల్ మెన్స్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు 15 మంది విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్.రజినికృష్ణ తెలిపారు. శనివారం ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు అభినందన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫిబ్రవరి 5వ తేదీన పట్టణంలో జరిగిన నేషనల్ మెన్స్ మెరిట్ స్కాలర్‌షిప్ పోటీ పరీక్షలో తమ పాఠశాలకు చెందిన 15 మంది విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయ బృందం అభినందించారు. సమావేశంలో ఉపాధ్యాయులు గోపాల్‌గౌడ్, ప్రసన్నకుమార్, మహమ్మద్‌రఫీ, రామకృష్ణ, మహేశ్వర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐఎన్‌టిఎస్‌ఒలో చైతన్య విద్యార్థుల విజయభేరి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పట్టణ కేంద్రంలోని ఆర్ఎస్ రోడ్డులోని శ్రీ చైతన్య పాఠశాలలో విద్యను అభ్యసించే విద్యార్థులు ఇటీవల జరిగిన ఐఎన్‌టిఎస్‌ఒలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఫలితాలలో విజయభేరి మ్రోగించారని ఉమ్మడి కడప ఎజిఎం రమణయ్య, ప్రిన్సిపల్ ఆకేపాటి సుధాకర్‌రెడ్డి తెలియజేశారు. శనివారం ఐఎన్‌టిఎస్‌ఒలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 3 నుంచి 10వ తరగతుల విద్యార్థుల విజేతలకు ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ 355 మంది పాల్గొనగా అందులో స్వర్ణ పతకాలు 7, మెరిట్ సర్టిఫికెట్లు 214 సాధించారన్నారు. ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ చూపడం వల్లనే ఈ విజయం సాధ్యమైందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ అనూష, అకాడమిక్ డీన్ వెంకటసుబ్బయ్య, సి బ్యాచ్ ఇన్‌ఛార్జి శ్రీనివాసులు, ప్రైమరీ ఇన్‌ఛార్జి కస్తూరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేలం పాటల్లో రూ.19.31 లక్షల ఆదాయం

ప్రజాశక్తి-వాల్మీకిపురం

వాల్మీకిపురం గ్రామ పంచాయతీకి సంబంధించి శనివారం పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన వేలం పాటల ద్వారా పంచాయతీకి రూ.19.31 లక్షల ఆదాయం వచ్చినట్లు ఇఒ ఉదయ్ కుమార్ తెలిపారు. మదనపల్లి డిఎల్‌పిఒ జయకుమారి ఆధ్వర్యంలో ఈ ఏడాది రుసుము వసూళ్లకు నిర్వహించిన వేలం పాటలు పోటాపోటీగా సాగాయి. వారపు సంత రూ.9.61 లక్షలు, దినసరి మార్కెట్ రూ.5 లక్షలు, ప్రైవేట్ బస్టాండ్ రూ.3.58 లక్షలు, జంతువధశాల రూ.1.12 లక్షలుగా వేలంలో పాడుకున్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ షబ్బీర్ అహ్మద్, సర్పంచ్ గంగులమ్మ, ఇఒఆర్‌డి శకుంతల, ఉప సర్పంచ్ కేశవరెడ్డి, పంచాయతీ సిబ్బంది, వేలం పాటదారులు పాల్గొన్నారు.

ఘనంగా 'విజయభారతి' వార్షికోత్సవం

మదనపల్లె అర్బన్: పట్టణంలోని విజయభారతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ 31వ వార్షికోత్సవ వేడుకలు పాఠశాల ఆవరణంలో శనివారం అట్టహాసంగా జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా కరెస్పాండెంట్ డాక్టర్ ఎన్.సేతు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు క్రమశిక్షణను నేర్పించడం మా ఉద్దేశ్యమన్నారు. తమ పాఠశాలలో విద్యనభ్యసించిన ఎంతో మంది విద్యార్థులు వివిధ రంగాల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించడం గర్వంగా ఉందన్నారు.దీని వెనుక ఉపాధ్యాయుల నిర్విరామ కృషి, విద్యార్థులు కఠోర శ్రమ ఎంతో ఉందని కితాబునిచ్చారు. తమ విద్యార్థులు విద్యతోపాటు, క్రీడలు, కరాటే, రాష్ట్ర, జాతీయ స్థాయిలో వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచి పాఠశాల ప్రతిష్టను పెంచుతున్నారని కొనియాడారు. ప్రతి ఏడాది పదవ తరగతి ఫలితాల్లో తమ పాఠశాల అద్భుత ఫలితాలు సాధిస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు.గతంలో జాతీయ, రాష్ట్ర స్థాయిలో చాలా మంది ప్రముఖులు తమ పాఠశాలకు విచ్చేసి వారి అమూల్యమైన సలహాలను అందించారన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఉదయ్‌మోహన్‌రెడ్డి

వెలుగులో జాతీయ సెరిబ్రల్ పాల్సీ దినోత్సవం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మండలంలోని వెలుగు ప్రత్యేక పాఠశాలలో నేషనల్ సెరిబ్రల్ పాల్సీ అవగాహన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వెలుగు సిబ్బంది జె.ఎన్.విజయ కుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ప్రిన్సిపల్ పి.లీనాకుమారి, జి.రమాదేవిలను స్వాగతించి పుష్పగుచ్చాలను అందజేశారు. జె.ఎన్.విజయ కుమారి మాట్లాడుతూ సెరిబ్రల్ పాల్సీ అంటే మెదడు పక్షవాతం అనీ, ఇది ఒక రుగ్మత అనీ, దీనిని నయం చేయడానికి ఎటువంటి మందులు లేవనీ తెలిపారు. సెరిబ్రల్ పాల్సీ ఉన్న పిల్లలకు ఫిజియో థెరపీ, ఆక్యుపేషనల్ థెరపీ, ఆపరేషన్స్, సహాయ పరికరాలు ఉపయోగించడం ద్వారా వీరిలో రుగ్మత తీవ్రతను తగ్గించ గలమేగానీ నయం చేయలేమన్నారు. ఈ సెరిబ్రల్ పాల్సీలోని రకాలు, వైవిధ్యాలు గురించి తెలియజేశారు. పి.లీనాకుమారి మాట్లాడుతూ 2016 యాక్ట్ ప్రకారంలో ఉన్న 21 రకాల వికలత్వాలకు సంబంధించిన రోజులను మన సంస్థలో నిర్వహించాలనీ తెలిపారు. సెరిబ్రల్ పాల్సీ అవగాహన రోజును జరుపుకుంటున్నామనీ తెలిపారు. 2006వ సంవత్సరం నుండి అమలులోకి వచ్చిందనీ తెలిపారు. సెరిబ్రల్ పాల్సీ ఉన్న పిల్లల్ని ఒక సమూహంగా చేర్చి సమాజంలో కలిపి వారికీ అన్ని సహకారాలు పొందే అవకాశం కల్పించడం కోసం ఈ రోజును జరుపుకుంటున్నామనీ తెలిపారు. కార్యక్రమంలో అక్షయ, జ్యోతి కిరణ్, పవన్ నృత్య ప్రదర్శనలతో పిల్లలందరినీ అలరించారు. కార్యక్రమంలో వెలుగు సెక్రటరీ ఎం.ఉదయ్ మోహన్‌రెడ్డి, వెలుగు కన్వీనర్ ఆర్.భాగ్యలక్ష్మి, ప్రిన్సిపల్ పి.లీనాకుమారి, వెలుగు సిబ్బంది, చిన్నారులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ టవర్ ఏర్పాటును ఆపివేయాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మండలంలోని కొండామర్రిపల్లి గ్రామ పంచాయతీ టి.ఎన్.ఆర్.కాలనీలో ఏర్పాటు చేస్తున్న మొబైల్ టవర్లను ఆపివేయాలని స్థానికులు కోరుతున్నారు. ఇసుకనూతిపల్లి పరిసర ప్రాంతాలలో నివాస ప్రాంతాల మధ్యలో మొబైల్ టవర్‌ను ఏర్పాటు చేస్తున్నారని వాపోయారు. ఈ ప్రాంతం పట్టణానికి దగ్గరగా ఉండి దినదిన అభివృద్ధి చెదుతుండడంతో అనేక మంది ఇక్కడ నివసిస్తున్నారు. అనేక మౌలిక సదుపాయాలు పున్నప్పటికీ, నివాస ప్రాంతాలలో వాటి ఉనికి ఆందోళన కలిగిస్తుందన్నారు. ఇప్పటికే అతుక్కుచిక్కని జబ్బులతో ప్రజలు సతమతమవుతున్న తరుణంలో ఇలా నివాస ప్రాంతాల్లో సెల్ టవర్స్ నిర్మిచడం సరికాదన్నారు. సెల్‌ఫోన్ తరంగాలు మన శరీరంలోని కణాలను వేడెక్కించడమేనని, రేడియేషన్ కణాలు వేడెక్కడం ద్వారా వాటి పనితీరు, జన్యు నిర్మాణం దెబ్బతింటుందన్నారు. నేపథ్యంలో మొబైల్ టవర్లకు దగ్గరగా జీవించడంవల్ల కలిగే అప్రయోజనాలను దృష్టిలో వుంచుకుని, మొబైల్ టవర్ల వల్ల కలిగే దుష్ప్రభావాలనుండి మమ్ము రక్షించి భావి తరాలకు ఆరోగ్య బిక్ష ప్రసాదించాలని కోరారు. అక్రమ మొబైల్ టవర్ల ఆపివేయాలని అధికారులకు విన్నవించినా పాటించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సెల్‌ఫోన్ టవర్స్ ఇండ్ల మధ్యలో పెట్టకూడదని అధికారులకు విన్నవించినా పాటించుకోవడం లేదని, వారికి తెలిసే ఇలాంటివి జరుగుతున్నాయని పేర్కొన్నారు. నివాస ప్రాంతాల్లో అనుమతి ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై కలెక్టర్‌కు పిర్యాదు చేశామన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో 47 మందికి ఉద్యోగాలు

మదనపల్లె అర్బన్: పట్టణంలోని ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో బి.టెక్ నాలుగో సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు మెయిన్ టెక్ టెక్నాలజీస్ ప్రయివేట్ లిమిటెడ్ వారు నిర్వహించిన క్యాంపస్ ఎంపికల్లో 47 మంది విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి తెలిపారు. హెచ్ఆర్ కేశవరెడ్డి ఇంటర్వ్యూ నిర్వహించి ఎంపిక చేసుకున్నారని తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.సతీష్ బాబు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో టిపిఒ సిమనోజ్ కుమార్, ప్లేస్మెంట్ కో-ఆర్డినేటర్ పి.లోకేష్, మునికుమార్ వివిధ విభాగాధిపతులు అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆందోళనపథం

ప్రజా'దృష్టి'

ప్రభుత్వం క్షేత్రస్థాయి సిబ్బంది సేవల కారణంగానే సామాజిక పురోభివృద్ధి సాధిస్తోంది. ఇటువంటి వారి న్యాయమైన డిమాండ్లను సానుకూల దృక్కోణంలో ముందుకెళ్లాలి. కానీ కొన్ని దశాబ్దాలుగా క్షేత్రస్థాయి సిబ్బంది హక్కుల గురించి ప్రస్తావన వినగానే ఉలిక్కి పడుతోంది. క్షేత్రస్థాయి సిబ్బంది సేవల ఆధారంగానే ఉత్తరాది రాష్ట్రాల కంటే దక్షిణాధి రాష్ట్రాల్లో ముందు వరుసలో ఉండడం కొనసాగుతోంది. తొలి, మలి స్థానాల కోసం పోటీపడుతోంది. ఇటువంటి కేటగిరీలో మొదటి స్థానంలో నిలుస్తున్న అంగన్వాడీ కార్యకర్తల సేవల ఆధారంగానే రాష్ట్రం ఇటీవల మానవాభివృద్ధి సూచికల్లో మెరుగుదల సాధిస్తోంది. అటువంటి కార్యకర్తలను గుర్తించి, వారికి ప్రోత్సాహకాలు అందించి సముచితంగా గౌరవించాలి. కానీ అటు వంటి అంగన్వాడీ సేవలకు ప్రతిఫలంగా వారి హక్కులను, డిమాండ్లను గుర్తించాల్సిందిపోయి నిర్బంధానికి పాల్పడుతోంది. నిరసన పిలుపు వినగానే ముందురోజు హౌస్ అరెస్టు మొదలుకుని ఎక్కడిక్కడ నిరసన కార్యకలాపాలకు అడ్డంకులు కలిగిస్తోంది. అయినప్పటికే కార్మిక సంఘం పోలీసు నిర్బంధాలను లెక్క చేయకుండా అంగన్వాడీలను ఆందోళనబాట పట్టించడం పాలకులను నివ్వెరపరిచింది. 2024 సార్వత్రిక ఎన్నికల ముంగిట కార్మిక లోకం నిర్బంధాలకు వెరవకుండా ఉద్యమించాలి. లేనిపక్షంలో కార్మికుల న్యాయమైన హక్కుల సాధనకు అరుదైన అవకాశాన్ని చేజార్చుకున్నట్లు అవుతుందని గ్రహించాలి. ఉమ్మడి కడప జిల్లాలో సుమారు ఏడు వేల మందికిపైగా అంగన్వాడీలు ఉన్నారు. వీరందరికీ సిఐటియు, ఎఐటియుసి సంఘాలు నాయకత్వం వహిస్తుండడం తెలిసిందే. అంగన్వాడీ కార్యకర్తల న్యాయమైన డిమాండ్లను అంగీకరించి అమలు చేయాల్సి ఉంది. చాలీచాలని వేతనాలతో కడుపులు కాలే కార్మికుల న్యాయమైన డిమాండ్లను అంగీకరించాల్సి ఉంది. అంగ న్వాడీల జీతాలను తెలంగాణా రాష్ట్రం తరహాలో పెంచుతామని ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేయడం నేరంగా మారింది. అంగన్వాడీ కార్యకర్తలు క్షేత్రస్థాయిలో మహిళల్లో రక్తహీనత, గర్భిణులకు వైద్యచికిత్సలు, సలహాలు అందించడం, పిల్లల్లో రక్తహీనత, ప్రైమరీ విద్యను అందించడం వంటి సామాజికాభివృద్ధిలో కీలకపాత్ర పోషించడం తెలిసిందే. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కళ్లు, కాళ్లుగా మారిన అంగన్వాడీలను గుర్తించి గౌరవించాల్సి ఉంది. ఇటువంటి అంగన్వాడీల నిరుపమాన సేవలను కొనియాడాలి, కానీ వారి న్యాయమైన హక్కులు, డిమాండ్లపై ఉక్కుపాదం మోపడం విస్మ యాన్ని కలిగిస్తోంది. ప్రజాస్వామ్యంలో తమకు జరిగిన అన్యాయాన్ని నిరసన రూపంలో వెల్లడించే ప్రజాస్వామ్య హక్కును సైతం లాగే సుకునే నియంతృత్వ పోకడలకు పాల్పడడం విస్మయాన్ని కలిగిస్తోంది. దేశంలో, రాష్ట్రాల్లో ఎన్ని ప్రభుత్వాలు మారినా కార్మికుల కష్టాలు పెచ్చు మీరుతూనే ఉంటాయనే చరిత్ర నిరూపించిన చారి త్రక సత్యం, ఇటువంటి అనుభవ పరిస్థితుల నేపథ్యంలో అంగన్వాడీలతోపాటు క్షేత్రస్థాయిలో పని చేసి సంపదను సృష్టించే కార్మిక, కర్షకలోకం రాజకీయంగా చైతన్యవంతం కావాలి. లేనిపక్షంలో పిడికెడు మంది కార్పొరేట్ల ఉక్కు పిడికిళ్ల మధ్య కార్మికులు, కర్షకులు, సామాన్యులు విలవిలాడుతూ బతుకులీడాల్సి ఉంటుందనే స్పృహను, చైతన్యాన్ని, ఎరుకను కలిగినప్పుడే రాజ్యాంగ లక్ష్యమైన సమ సమాజ సాకారం సాధ్యపడుతుందని చెప్పవచ్చు.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

బ్రహ్మోత్సవాలకు శ్రీపట్టాభి రామాలయం ముస్తాబు

- టిటిడి ఆధ్వర్యంలో ఘనంగా ఏర్పాట్లు
- కల్యాణోత్సవానికి నేడు అంకురార్పణం

ప్రజాశక్తి-వాల్మీకిపురం

వాల్మీకిపురంలో వెయ్యేళ్లకు పైగా చరిత్ర కలిగిన శ్రీ పట్టాభిరామస్వామి బ్రహ్మోత్సవాలకు తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఆలయ ప్రాంగణమంతా రంగులు వేశారు. స్వాగత తోరణాలు, రంగు రంగు విద్యుత్తుదీపాల కాంతులు, శ్రీరాముని కటౌట్లు, ఆరుబయట కల్యాణోత్సవానికి ఏర్పాట్లు చకచకా సాగుతున్నాయి. ఆదివారం సాయంత్రం ఆరు గంటలకు టిటిడి వేధపండితులు మంత్రోచ్ఛరణల మధ్య బ్రహ్మోత్సవాలకు అంకురార్పణం చేస్తారు. 27వ తేదీన ఉదయం ధ్వజారోహణం, రాత్రి గజ వాహనంతో వాహన సేవలు ప్రారంభమవుతాయి. పట్టాభిరాముని ఊరేగింపు ఉంటుంది. 28న ముత్యపు పందిరి, హనుమంత వాహనంపై ఊరుగుతారు. 29న కల్పవృక్ష, సింహ వాహనంపై ఆశీనులవుతారు. 30న సర్వ భూపాల, పెద్దశేష వాహనం, 31న సూర్యప్రభ, చంద్రప్రభ వాహనం, రాత్రి మోహినీ అవతారం ఉంటుంది. ఏప్రిల్ ఒకటవ తేదీన తిరుచ్చి ఉత్సవం, రాత్రి శ్రీ సీతారాముల కళ్యాణోత్సవం, గరుడ వాహనంపై స్వామి ఊరేగుతారు. 2న రథోత్సవం, సాయంత్రం ధూళి ఉత్సవం ఉంటుంది. 3న తిరుచ్చి ఉత్సవం, రాత్రి అశ్వ వాహనం, పార్వేట ఉత్సవం ఉంటుంది. 4వ తేదీ వసంతోత్సవము, చక్రస్నానం, రాత్రి హంస వాహనం, ధ్వజావరోహణం, 5వ తేదీ స్నపన తిరుమంజనం, సాయంత్రం పుష్పయాగంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతున్న శ్రీ పట్టాభిరామాలయం

పది పడకల ఆస్పత్రిని ప్రారంభిస్తున్న ఐజి సుజైల్ తాసిన్

ఘనంగా సిఆర్‌పిఎఫ్ 84వ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-కలికిరి

సిఆర్‌పిఎఫ్ 84 ఆవిర్భావ దినోత్సవం ప్రిన్సిపల్, కమాండెంట్ రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండలంలోని ఫతేగడ గ్రామపంచాయతీ, పాల్యం కొండ వద్ద సిఐఎటి-3 స్కూల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా సిఆర్‌పిఎఫ్ఐజి అజయ్ భారతన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలికిరి సిఆర్‌పిఎఫ్ స్కూల్ ప్రిన్సిపల్ అండ్ కమాండెంట్ రాజేష్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం హోంశాఖ ద్వారా కలికిరి సిఆర్‌పిఎఫ్ స్కూల్‌లో నూతనంగా నిర్మించిన గాడ్స్ క్వాటర్స్, పది పడకల వైద్యశాల నిర్మాణాలను వర్చువల్‌గా హోంమంత్రి అమిత్‌షా ప్రారంభించారని అన్నారు.అనంతరం కలికిరిలో ఐజి, డాక్టర్ సుజయలాల్ తాసిల్ చే నూతనంగా నిర్మించబడిన గాడ్స్ కోర్టర్, పది పడకల ఆస్పత్రి, ప్రారంభోత్సవం చేయించారు.కార్యక్రమంలో జెఎన్‌టియుఎ ప్రిన్సిపల్ ఎస్‌వి, సత్యనారాయణ, వైద్య అధికారిని హిమబిందు, సర్పంచ్ ఆర్, ప్రతాప్ కుమార్ రెడ్డి, సిపిడబ్ల్యుడి అధికారి శ్రీనివాసులు రెడ్డి, మహిళ అధికారులు, సిఆర్‌పిఎఫ్ జవాన్లు, ఐటిపిపి, బిఎస్ఎఫ్, సిపిడబ్ల్యుడి అధికారులు పాల్గొన్నారు.

మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు

ప్రజాశక్తి-కురబలకోట

ప్రారంభమైన మినరల్ వాటర్ ప్లాంట్

మండల కేంద్రంలోని కురబలకోటలో రాఫా ఫౌండేషన్ సౌజన్యంతో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశామని రఫా ఫౌండేషన్ వ్యవ స్థాపకుడు ప్రవీణ్ కంటి మహంతి అన్నారు. శనివారం మండలంలోని అంగళ్లు సమీపంలోని కడప-బెంగళూరు హైవేకు ఆనుకునియున్న సన్ రైజ్ స్కూల్ ప్రాంగణంలో మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభించచినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్లాంట్ ద్వారా రూ.5కే 20 లీటర్ల వాటర్ క్యాన్, రూ.2కే ఒకలీటర్ బాటిల్ అందిస్తామని చెప్పారు. వేసవి ఎండలు తీవ్రత ఎక్కువుగా ఉన్న తరుణంలో ఈ వాటర్ ప్లాంట్ ద్వారా అంగళ్లు, పరిసర గ్రామాల ప్రజలు రాహదారిపై వెళ్తున్న వాహనదారులు కూడా లబ్ధి పొందాలనే నీటి సదుపాయం కల్పించామన్నారు. రాఫా ఫౌండేషన్ ద్వారా 2010 వ సంవత్సరం నుండి ఉచిత చెవిటి మిషన్ల పంపిణీ, వృద్ధులు, వితంతువులు, అనాధ పిల్లలకు పింఛన్లు, ఆంధ్రా-ఒడిశా సరిహద్దులలో ఉండే గిరిజనులకు ఉచిత వైద్య శిబిరాల నిర్వహణ, తిత్లీ తుఫాను వంటి సమయాలలో ఉచిత వస్త్ర పంపిణీ, వైద్య సదుపాయాలు వంటి అనేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆన్‌లైన్ పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులు

'మిట్స్'లో సర్టిఫికెట్ కోర్సు ఆన్‌లైన్ పరీక్ష

ప్రజాశక్తి-కురబలకోట

మండల పరిధిలో అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులకు నేషనల్ ప్రోగ్రాం ఆన్ టెక్నాలజీ ఎన్హాన్స్ లెర్నింగ్ ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మద్రాసు వారు స్వయం అను పేరుతో నిర్వహించిన సర్టిఫికెట్ కోర్స్ ఆన్‌లైన్ పరీక్షను నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్. సి.యువరాజ్ తెలిపారు. ఈ పరీక్ష లో 485 మంది నమోదు చేసుకోగా 429 మంది హాజరు అయినట్లు ఆయన అన్నారు. వివిధ సబ్జెక్ట్స్ లో ఆన్‌లైన్ పరీక్షలను వారు సంవత్సరానికి రెండు సార్లు నిర్వహిస్తారని ఆయన అన్నారు. ఈ పరీక్షలలో ఉతీర్ణులు అయిన విద్యార్థులకు ఆన్‌లైన్ సర్టిఫికెట్‌ను అందజేస్తారని, ప్రతి ఏటా తమ విద్యార్థులు, అధ్యాపకులు ఈ పరీక్షలు రాస్తారని తెలిపారు.

విద్యార్థులకు విద్యాసామగ్రి అందిస్తున్న దాతలు

విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి -చిట్వేలి

మండల పరిధిలోని మానవ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పదవ తరగతి చదివే 373 మంది విద్యార్థులకు, దాతలు చిట్వేలు ఉప సర్పంచ్ ఉమామహేశ్వర్ రెడ్డి, ఉపాధ్యాయులు తిరుమల విశ్వనాథ నాయుడు, ఫ్యాన్సీ స్టోర్ నిర్వాహకులు ఇండ్లూరు సునీల్ సహకారంతో విద్యా సామాగ్రిని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు కృష్ణమూర్తి అధ్యక్షతన పంపిణీ చేశారు. విద్యార్థులు బాగా చదివి పరీక్షల్లో 550 మార్కులు సాధించిన విద్యార్థులకు రూ.5వేలు బహుమతి అందజేస్తానని దాత పురుషోత్తం అన్నారు. పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు 550 మార్కులు దాటిన పేద విద్యార్థులకు రూ5వేలు బహుమతిని విశ్వనాథం, శ్రీ సాయి జూనియర్ కాలేజ్ అధినేత నూక శ్రీనివాసులరెడ్డి విద్యార్థులకు కాలేజీలో ఉచిత చదువులు కొరకు సహకారం అందిస్తామని దాతలు హృదయాన్ని చాటారు. కార్యక్రమంలో నరసరామయ్య రంగా రెడ్డి అధ్యక్షులు ముని రావు, కార్యదర్శి సాయిరాం, ఉపాధ్యాయులు డేవిడ్ ప్రసాద్, ఎబిఎన్ ప్రసాద్, రాజశేఖర్, మానవత సభ్యులు మనీ పాల్గొన్నారు.

మహారాజ రాజశ్రీ పీలేరు ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

OS No.245/2021

కె. రవీంద్ర .....వాది

కె. కళష్ణమ్మ మరియు ఇతరులు ....ప్రతివాది

3వ ప్రతివాదికి దావా సమన్లు

3వ ప్రతివాది:

కె. మంజుల, భర్త లేట్ నారాయణస్వామి, C/o చెర్లోపల్లి మధు, నాయీబ్రాహ్మణ కాలనీ, ఎస్.వి. నగర్, ఆర్.టి.ఓ ఆఫీస్ ఎదురుగా, పీలేరు టౌన్, పీలేరు మండలం, అన్నమయ్య జిల్లా.

పై వాదులు దాఖలు చేసిన పై దావాలో మీ హాజరు నిమిత్తమై 31.03.2023వ తేదీన వాయిదా వేసి ఉన్నారు. కావున మీరు నేరుగా కాని లేదా న్యాయవాది ద్వారా కాని కోర్టులో 31.03.2023వ తేదీన ఉదయం 10:30 గంటలకు హాజరై మీ వాదనాలను తెలుపుకొనవలెను లేని యడల మీ పరోక్షమున తీర్పు ఇవ్వబడునని తెలియజేయడమైనది.

// BY ORDER OF COURT //

ఆర్.చంద్రశేఖర్
న్యాయవాది, పీలేరు

మహిళా సాధికారతే సిఎం ధ్యేయం

ప్రజాశక్తి-తంబళ్లపల్లె

మహిళల అభివృద్ధి, సాధికారత సాధించే ఆశయంతోనే ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని మండలాభివృద్ధి కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి తెలిపారు. శనివారం వైఎస్‌ఆర్ ఆసరా పథకం మూడో విడత రుణమాఫీ నగదును సిఎం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ కార్యాలయంలో మహిళలతో సమావేశం జరిగింది. ముఖ్యమంత్రి ప్రసంగాన్ని టివి ద్వారా మహిళలు తిలకించారు. మండలంలో 106 మహిళా సంఘాల సభ్యులకు మూడవ విడతలో రూ.5.07 కోట్లు విడుదలయ్యాయి. ఆ మొత్తాన్ని మహిళలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. మహిళలు వైయస్ జగన్మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ మా కుటుంబాలు ముఖ్యమంత్రి కి రుణపడి ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో ఎటిఎం గంగాధర్, ఎంపిటిసిసరోజమ్మ, బిసి నాయకులు రామ్మూర్తి, సిసిలు, సంఘమిత్ర లు, మహిళా సభ్యులు పాల్గొన్నారు. **నిమ్మనపల్లి :** మహిళా సంఘాలలోని సభ్యుల ఆర్థిక అభివృద్ధికి తోడుగా వైఎస్‌ఆర్ ఆసరా పథకం ఉపయోగపడుతుందని వెలుగు ఎపిఎం రజనీకుమారి తెలిపారు. వైఎస్‌ఆర్ ఆసరా మూడో విడత నిధులను ముఖ్యమంత్రి విడుదల చేస్తున్న కార్యక్రమాన్ని మండల వ్యాప్తంగా రైతు భరోసా కేంద్రాలలో ప్రత్యక్ష ప్రసారాన్ని లబ్ధిదారులు వీక్షించారు. నిమ్మనపల్లి మండలంలోని 591 మహిళా సంఘాలలోని 5112 మంది సంఘ సభ్యులు రూ.5,12,86,592 కోట్లు లబ్ధి పొందుతున్నట్లు వివరించారు. లబ్ధిదారులు ఆసరా నిధులను మహిళల ఆర్థిక అభివృద్ధికి, కుటుంబ సుస్థిరతకు ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచులు సుబ్రమణ్యం, రెడ్డమ్మ, వెంకటరత్న, చంద్రాయుడు, మహాదేవ రెడ్డి, రెడ్డప్ప, పాపులమ్మ, వరలక్ష్మి, ఉషారాణి, శ్రీవాణి, వైసిపి నాయకులు, వెలుగు సిసిలు, సంఘమిత్రలు, సచివాలయ సంక్షేమ విద్యా సహాయకులు, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

తవళం ఆర్‌బికెలో సిఎం ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షిస్తున్న లబ్ధిదారులు

చిరుధాన్యాలు ఆరోగ్యానికి సోపానాలు

చిరుధాన్యాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్న కెవికె శాస్త్రవేత్తలు

ప్రజాశక్తి-కలికిరి

చిరుధాన్యాలు ఆరోగ్యానికి సోపానాలని కెవికె కో-ఆర్డినేటర్ డాక్టర్ పాండురంగ తెలిపారు. శనివారం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు దత్తత గ్రామమైన ముడియంవారిపల్లిలో నిర్వహిస్తున్న కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ నీటి వనరులు, ఎరువులు అవసరమైనటువంటి చిరుధాన్యాలు పండించడం ద్వారా తక్కువ సాగు ఖర్చు, అధిక ఆదాయం వచ్చే అవకాశం ఉందని వివరించారు. గృహ విజ్ఞాన శాస్త్రవేత్త ఐ.జ్యోతి చిరుధాన్యాల్లో ఉన్నటువంటి పోషక విలువలు, చిరుధాన్యాల విలువాధారిత ఉత్పత్తులు చేసి ఆర్థికంగా ఎలా లబ్ధి చేకూరవచ్చునని తెలిపారు. కె.నవీన పెరటి కోళ్ల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. డాక్టర్ శ్రీనివాసులు, బొప్పాయి, మిరపలో సమగ్ర యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. డాక్టర్ కె.మాధురి మాట్లాడుతూ కెవికె అందిస్తున్నటువంటి సేవలు రైతులు వినియోగించుకోవాలని అన్నారు. కెవికెను సందర్శించాలని, రైతుల పొలాల్లో ప్రథమ శ్రేణి అయినటువంటి నిత్య హరిత వేరుశనగరకం, సేంద్రియ పద్ధతులో వేరుశనగ సాగు, టమోటాలో పురుగులు, తెగుళ్ల నివారణ పద్ధతుల్ని పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయధికారి గౌరి, విఎఎ రెడ్డి కుమార్, సర్పంచ్, రైతులు పాల్గొన్నారు. **ములకలచెరువు :** ములకలచెరువు గ్రామ సచివాలయంలో శనివారం పోషన్ పఖ్వాడా ను ఐసిడిఎస్ సూపర్వైజర్ మంజుల కుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం సంప్రదిస్తుందని తెలిపారు. చిరుధాన్యాలతో వండిన పౌష్టికాహార వంటకాలను ప్రదర్శించారు. చిరుధాన్యాలతో వండిన పౌష్టికాహార వంటకాలతో బాలింతలు, గర్భిణులకు, చిన్నారులలో రక్తహీనత లోపం అధికమించవచ్చున్నారు. ప్రతిరోజు గర్భిణులకు రాగి పిండి, జొన్న పిండి విధిగా అంగన్వాడీ సెంటర్ల నుండి పంపిణీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ రహమత్‌బి, ఎంపిటిసి ఆయేషా చాంద్ బాషా, ఉప సర్పంచ్ సురేష్, అంగన్వాడీ వర్కర్లు, వైద్య సిబ్బంది, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

సర్పంచ్‌ను పరామర్శించిన 'కొరముట్ల'

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని పుల్లంపేటలో ఈనెల 23న రాత్రి ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే టిడిపి నాయకులు బాణాసంచా కాల్చుతున్న సందర్భంలో టిడిపి, వైసిపి నాయకుల మధ్య జరిగిన ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో గాయపడిన సర్పంచ్‌ను శనివారం ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, కొల్లం గంగిరెడ్డి, వైసిపి నాయకులు కలిసి పరామర్శించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి నాయకులకు, కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారికి ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా ముందుంటామని అన్నారు. జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్ రాజు, దలవాయిపల్లి మాజీ సర్పంచ్ మల్లికార్జున రెడ్డి, మూరి శంకర్ రెడ్డి, బికె మనీ, ధ్వజారెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సర్పంచ్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, నాయకులు

జగనన్న విద్యా కానుక వినియోగం భేష్

విద్యార్థులతో మాట్లాడుతున్న కెవి.శ్రీనివాసులు

ప్రజాశక్తి-పీలేరు

జగనన్న విద్యా కానుకలను సద్వినియోగం చేసుకోవడంలో పీలేరు ప్రాంత విద్యార్థులు రాష్ట్రంలో ముందు వరసలో ఉంటారని సమగ్ర శిక్షా రాష్ట్ర అదనపు పథక సంచాలకులు కె.వి. శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. శనివారం ఆయన స్థానిక జడ్‌పిహెచ్‌ఎస్ మెయిన్, అయ్యప్ప రెడ్డి కాలనీలోని జడ్‌పి బాలికొన్నత పాఠశాలలను ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలల్లోని ప్రతి తరగతి గదికీ వెళ్లి అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. జరుగుతున్న పాఠ్యాంశాలపై ప్రశ్నలు వేయడంతో పాటు, పిల్లల కనీస భాషా సామర్థ్యాలను పరీక్షించారు. తరగతి గదుల్లో పలు సబ్జెక్టులను ఆయన స్వయంగా పిల్లలకు బోధించారు. తరగతి గదుల పరిశీలన అంశాలను ఉపాధ్యాయులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి వారి పర్యటనలో చాలా మంది షర్టులు ధరించలేదని పేర్కొనడంతో తనిఖీ నిర్వహించినట్లు చెప్పారు. వర్షం పడిన కారణంగా విద్యార్థులు సమవస్త్రాలు ధరించని రోజున ముఖ్య కార్యదర్శి తనిఖీ చేయడంతో ఎక్కువ మంది పిల్లలు షర్టులు ధరించి రాలేదని వివరించారు. అనంతరం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ పీలేరులో తాను పరిశీలించిన పాఠశాలల్లో విద్యార్థులందరూ జగనన్న విద్యా కానుకలో అందించిన షర్టులు బ్యాగు, పుస్తకాలతో హాజరు కావడం గుర్తించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఇఒ బాలాజీ నాయక్, ప్రధానోపాధ్యాయులు ప్యారూఖాన్, ఎన్.జయమ్మలను అభినందించారు. కార్యక్రమములో డిప్యూటీ డిఇఒ ఆనంద రెడ్డి, రాష్ట్ర ఉర్దూ ఎఎంఒ అబ్దుల్ ఘనీ, జిల్లా సమగ్ర శిక్షా సిఎంఒ కరుణాకర్, పాఠశాలల సమన్వయ కర్త చంద్రశేఖర్ నాయక్, ఎపిఒ బాలాజీ నాయక్ పాల్గొన్నారు.

రోడ్డు పనులు పరిశీలించిన పిఆర్ ఎస్ఇ

ప్రజాశక్తి-రాయచోటి

సంబేపల్లి మండలం నారాయణ రెడ్డిగారిపల్లి పంచాయతీ జగనన్న కాలనీలో జరుగుతున్న తారు రోడ్డు పనులను వైఎస్‌ఆర్ జిల్లా పంచాయతీ రాజ్ ఎస్ఇ శ్రీనివాసరెడ్డి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రాయచోటి పంచాయతీరాజ్ కార్యాలయంలో మాట్లాడుతూ రూ.1.85కోట్లతో జరుగుతున్న తారు రోడ్డు పనులను పరిశీలించినట్లు ఆయన తెలిపారు. పంచాయతీరాజ్ సబ్ డివిజన్ డిఇ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగేటటువంటి పనులను ఆయన పరిశీలించారు. రాయచోటి రూరల్ పరిధిలోని 9 గ్రామ పంచాయతీలకు సంబంధించిన ఎంపిడిఒ కార్యాలయం రూ.1.30 కోట్లతో జరిగే పనులకు ఈనెల 31వ తేదీ లోపల వెంటనే బిల్లులు చేయాలని పంచాయతీరాజ్ డిఇ వెంకటరెడ్డిని ఆదేశించారు. పనులు నాణ్యవంతంగా ఉన్నాయని ప్రతి పనిని పరిశీలించిన తర్వాతే సంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్లు వెంకట్రాంరెడ్డి, శ్రీనివాసులురెడ్డి ,రాయచోటి సబ్ డివిజన్ డిఇ వెంకట్ రెడ్డి, పంచాయతీరాజ్ రూరల్ ఎఇ హేమ కుమార్, అర్బన్ ఎఇ హర్షవర్ధన్ రెడ్డి, రాయచోటి మండల ఇఒపిఆర్‌డి సురేష్ బాబు ,మాధవరం పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్ఇ శ్రీనివాసరెడ్డి

ప్రభుత్వానికి కృతజ్ఞతలు

ప్రజాశక్తి-కడప అర్బన్

దళిత క్రైస్తవులను ఎస్సీలుగా పరిగణించాలని శాసనసభలో తీర్మానం చేయడం పట్ల ప్రభుత్వానికి ఎస్టీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల శివా అర్జున కృతజ్ఞతలు తెలిపారు. శనివారం ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్టీల్లోకి బోయలను, వాల్మీకులను చేర్చాలని ప్రభుత్వం చేసిన తీర్మానం అశాస్త్రీయమైందని, దుర్మార్గమైన, సహించరాని చర్యగా పేర్కొన్నారు. ఇది రాష్ట్రంలో ఉన్నటువంటి ఎస్టీల అభివృద్ధిని నిరోధించే ప్రక్రియ అని వెంటనే ఈ తీర్మానాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్‌టి ఎమ్మెల్యేలందరూ ఈ తీర్మానాన్ని వ్యతిరేకిస్తూ, వెంటనే వారి పదవులకు రాజీనామా చేయాలని, లేని పక్షంలో జాతి ద్రోహులుగా మిగులుతారని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు సుదర్శన్ బాబు, ప్రధాన కార్యదర్శి మేండ్రగుత్తి గంగరాజు, కట్టా గంగాధర్, శేషగిరిరావు పాల్గొన్నారు.**కడప :** దళిత క్రైస్తవులను ఎస్సి జాబితాలో చేర్చాలని తీర్మానించడం అభినందనీయమని న్యూ నేటివ్ కృపా మినిస్ట్రీస్ అధ్యక్షులు పాస్టర్ పి.మహేష్, సిస్టర్ శాంతమ్మ అన్నారు. శనివారం కృపా కాలనీలోని న్యూ నేటివ్ కృపా మినిస్ట్రీస్ లో వారు మాట్లాడారు. సీఎం జగన్‌కు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.దళిత క్రైస్తవులకు ఎస్సిలో చేర్చాలని అసెంబ్లీలో కీలక తీర్మానం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పి.రవితేజ, ఎ.అగస్టిన్, శాంతిరాజు, రోజా, లీలావతి సంఘం పెద్దలు, విశ్వాసులు పాల్గొన్నారు.

ఎస్‌సి హోదా జాతీయ స్థాయి అంశం : టిడిపి

ప్రజాశక్తి-కడప అర్బన్

దళిత క్రైస్తవులను ఎస్‌సిలుగా మార్చాలనే అంశము జాతీయ స్థాయిలోనిదని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి ఆమూరి బాలదాసు పేర్కొన్నారు. శనివారం నగరంలోని టిడిపి జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షుడు రెహమాన్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలదాసు మాట్లాడుతూ భారత ప్రజాస్వామ్య పార్లమెంట్ తీర్మానం, సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పు, రాష్ట్రపతి ఆమోదం మొదలగు అంశాలతో దళిత క్రైస్తవుల ఎస్‌సి హోదా ముడిపడి ఉందని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే 22 మంది వైసిపి ఎంపీలు, 8 మంది రాజ్యసభ సభ్యులతో పార్లమెంటు సమావేశాలలో ప్రధానమంత్రి సమక్షంలోచర్చించి ఆమోదింప చేయాలని డిమాండ్ చేశారు. అలా చేస్తే అప్పుడు నువ్వు దళిత క్రైస్తవులకు నిజమైన న్యాయం చేయగలిగిన ముఖ్యమంత్రి అవుతారని అన్నారు. దళిత క్రైస్తవులను ఎస్సీలుగా చేర్చాలనే ప్రతిపాదనలు 40 సంవత్సరాలుగా పార్లమెంటులో బిల్లు ప్రతిపాదనలు అమలుకు నోచుకోకుండా మూలనపడి ఉందని చెప్పారు. సమావేశంలో నగర మైనార్టీసెల్ అధ్యక్షులు ఇమ్రాన్, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షులు సయ్యద్ రెహమాన్ పాల్గొన్నారు.

వేలంపాట నిర్వహిస్తున్న డిఎస్‌పి కేశప్ప

వేలంపాట ఆదాయం రూ.11.79 లక్షలు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ఎస్‌పి హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు,మదనపల్లి డిఎస్‌పి కేశప్ప, సిఐ శివాంజనేయులు పర్యవేక్షణలో వివిధ కేసులో పట్టుబడిన 17 వాహనాలను శనివారం ఉదయం 11 గంటలకు స్థానిక పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో వేలం పాట నిర్వహించినట్లు ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం 17 ద్విచక్ర వాహనాలు, మూడు కార్లు, మూడు ఆటోకు వేలంపాట నిర్వహించినట్లు చెప్పారు. వాహనాల వేలంపాట ద్వారా రూ.11,79,500లు ప్రభుత్వానికి ఆదాయం వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ రవీంద్రనాయక్, నాగరాజు గౌడ్, కానిస్టేబుల్ నాగేంద్ర, శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, కావ్య, అంబ్రిష్, పోలీసులు పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-కలకడ

మండల కేంద్రమైన కలకడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(తెలుగు)లో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు లయన్స్ క్లబ్ మండల అధ్యక్షులు దగ్గుపాటి వెంకటేశ్వరరావు తెలిపారు. కంటికి సంబంధించిన జబ్బులు ఉన్నవారు తమ ఆధార్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు తీసుకవచ్చి ఉచితంగా వైద్య సేవలో పొందవచ్చును అన్నారు. ఉచిత వైద్య శిబిరం నందు ఆపరేషన్లకు ఎంపికైన వారిని అదే రోజు తమ సొంత ఖర్చులతో తిరుపతికి తీసుకువెళ్లి ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామని చెప్పారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు.

విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

స్కాలర్‌షిప్‌కు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి-గాలివీడు

ఎన్ఎంఎస్ స్కాలర్‌షిప్‌కు స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో ఎనిమిదవ తరగతి విద్యార్థిని ఎం.భార్గవి ఎంపికైనట్లు ప్రధానో పాధ్యాయులు ఒ.నిర్మల పేర్కొన్నారు. స్కాలర్‌షిప్‌కు అర్హత సాధించిన విద్యార్థినిని పాఠశాల స్కూల్ కమిటీ చైర్మన్ కుందా లక్ష్మీప్రసన్న, ఉపాధ్యాయులు వసుంధర, హేమలత ఫైరోస్, భాస్కర్, పిఇటి, ఉపాధ్యాయుడు కరుణాకర్ అభినందించారు. ప్రతి ఏడాది బాలికల ఉన్నత పాఠశాల నుంచి ఎన్ఎంఎస్ స్కాలర్షిప్‌కు విద్యార్థులు ఎంపిక కావడం హర్షణీయన్నారు.**రాజంపేట అర్బన్ :** గత నెల 2 వ తేదీన జరిగిన ఎన్ఎంఎంఎస్ మెరిట్ స్కాలర్ షిప్ కు మన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు కే.పరిమళ తెలియజేశారు. ఎంపికైన వారిలో ఈ.గీతిక 116 మార్కులతో ఒసిజనరల్ కేటగరీ నందు, కె.విక్రమ్‌రావు 96 మార్కులతో బిసి కేటగరీ నందు మెరిట్ సాధించి స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠశాలలో అభినందన సభ ఏర్పాటు చేశారు. అభినందన సభలో ప్రధానోపాధ్యాయురాలు పరిమళ మాట్లాడుతూ ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చునని అన్నారు. విద్యార్థులకు రూ.12 వేలు చొప్పున నాలుగు సంవత్సరాలు పాటు స్కాలర్‌షిప్ అందజేయడం జరుగుతుందని తెలిపారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొని విద్యార్థులను అభినందించి హర్షం వ్యక్తం చేశారు.

నేటి నుంచి మహాభారత యజ్ఞం ప్రారంభం

ప్రజాశక్తి-కలకడ

మహాభారత యజ్ఞాన్ని ఆదివారము నుండి ప్రారంభిస్తున్నట్లు నిర్వాహకులు మాజీ సర్పంచ్ రామయ్య తెలియజేశారు. మండలంలోని బాలయ్య గారి పల్లి పంచాయతీ దేవళంపేటలో వెలసిన శ్రీ కామాక్షి సమేత సిద్దేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో మహాభారత యజ్ఞాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.ఈనెల 26వ తేదీ నుంచి మహాభారత యజ్ఞం పగలు హరికథ, రాత్రివేళలో వీధి నాటకం కార్యక్రమాలతో ప్రారంభమవుతుందని తెలిపారు.

పంచాయతీకి రూ.3.90 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - రామసముద్రం

మదనపల్లి డివిజనల్ పంచాయతి అధికారి ఆదేశాల మేరకు శనివారం చెంబకూరు పంచాయతీ కేంద్రంలో ప్రత్యేక అధికారి ఇఒపిఆర్‌డి చలపతిరావు ఆధ్వర్యంలో వారపుసంత, బస్టాండ్ గేటు దినసరి మర్కెట్, బహిరంగ వేలం నిర్వహించారు. వేలంపాటలో పాల్గొన్న పాటదారులు వారపు సంతకు రూ .1లక్ష, దినసరి మార్కెట్ కు రూ .50వేలు, బస్టాండ్ గేటుకు రూ.75వేలు నగదు డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొన్నారు. వేలం పాటలో వారపు సంత దినసరి మార్కెట్ రూ.3.20లక్షలు, బస్టాండ్ గేటు రూ.7వేలుకు కె.చంద్రశేఖర్ దక్కించుకున్నారు. కార్యక్రమంలో పంచాయతి కార్యదర్శి మునస్వామినాయక్, సర్పంచ్ రమణమ్మ, వేలంపాటదాలు పాల్గొన్నారు.

జాతీయ సైన్స్ ఫెయిర్‌కు కన్నెమడుగు విద్యార్థి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మ్యాన్‌హోల్ పరికరంతో విద్యార్థి

న్యూఢిల్లీలో జరగబోవు జాతీయస్థాయి సైన్స్ ఫెయిర్‌కు కన్నెమడుగు విద్యార్థి ఎంపికైనట్లు హెచ్‌ఎం సుబ్రహ్మణ్యం తెలిపారు. తంబళ్లపల్లి మండలం కన్యమడుగు జడ్‌పి ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న పి.మహమ్మద్ సిరాజ్ తయారుచేసిన మ్యాన్‌హోల్ శుభ్రపరిచే పరికరంపై ఈనెల 23, 24 తేదీల్లో రాజమండ్రిలో జరిగిన రాష్ట్రస్థాయి సైన్స్ పెయిర్‌లో పాల్గొని డెమో ఇచ్చారు. ఈ ప్రాజెక్టు స్థాయికి ఎంపికయింది. గైడ్ టీచర్లుగా రమణమ్మ, పిఎల్ఎన్ శాస్త్రి సూచనలతో ఆ పరికరాన్ని రూపొందించారు. మ్యాన్ హోల్ గల చెత్తను సులభంగా తొలగించవచ్చు. ఈ పరికరాన్ని ఉపయోగించడానికి చాలా సులభంగా ఉంటుంది ఒకచోట నుండి మరొక చోటకి తరలించవచ్చు. దీనికి వ్యాక్యూమ్ క్లీనర్ అమర్చితే ఇంట్లో చెత్తను కూడా తొలగించుకోవచ్చు. త్వరలో జరగనున్న జాతీయ స్థాయి సైన్స్ ఫెయిర్‌లో డెమో ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థిని ప్రతిభను సర్పంచ్ శామలమ్మ, ఎంపిటిసి సభ్యులు మహేష్, రామకృష్ణారెడ్డి, రవిశంకర్‌రెడ్డి స్కూల్‌కమిటీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి అభినందించారు.

క్రైం కార్నర్

రైలు కిందపడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పట్టణంలోని రైల్వే స్టేషన్ వద్ద శనివారం షఫీ (54) అనే వ్యక్తి రైలు కింద పడి మృతి చెందాడు. మృతుడు ఆకులవీధికి చెందిన వ్యక్తి అని సమాచారం. ప్రమాదవశాత్తు మృతి చెందాడా లేక ఆత్మహత్యకు పాల్పడ్డాడా అన్నది తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.